క్లుప్తంగా

142 మందికి కంటి పరీక్షలు



స్థానిక రామకోటి ప్రాంగణంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏలూరు (టూటౌన్) : స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంజేఎఫ్ లైన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉషాబాలకృష్ణ సహకారంతో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం వారిచే ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని ఆస్పత్రికి వ్యానులో తీసుకెళ్లారు. 24 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాంప్రసాద్ మృతికి జెడ్పీ చైర్‌పర్సన్ సంతాపం



రాంప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఘంటా పద్మశ్రీ

ఏలూరు (మెట్రో) : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కృష్ణాజిల్లా డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు ఉప్పాల రాంప్రసాద్ మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తీవ్ర సంతాపం తెలిపారు. కృష్ణా జిల్లా పెడన గ్రామానికి వెళ్లి రాంప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పించిన ఉప్పాల రాంప్రసాద్ వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పని చేసేవారని అన్నారు. బీసీల ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర వహించారని అన్నారు. సాధన కిషోర్, పామర్తి అచ్యుత్ గౌడ్ నివాళులు అర్పించారు.

లారీ బోల్తా

దెందులూరు: జాతీయ రహదారిపై సోమవరప్పాడు- ఆశ్రం వద్ద ఆదివారం అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మండలంలోని కలపర్రు టోల్ గేట్ వద్ద ఎస్సై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వారికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే విధానం జరిగే ప్రమాదాలను వారికి వివరించారు.తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

గ్రామదేవతల సంబరాలపై విస్తృత ప్రచారం

దెందులూరు: సనాతన సంస్కృతి సంప్రదాయాలు హిందుధర్మం పరిరక్షణ, అభివృద్ధితో పాటు గ్రామ దేవతల సంబరాలపై విస్తృత ప్రచారానికి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు కృషి చేస్తుందని బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. ఆదివారం ఆమె నివాసంలో మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధితో పాటు ప్రణాళికాబద్ధంగా హిందూ ధర్మ రక్షణకు చర్యలు, పూజలను నూతన ఆలయ చైర్మన్, బోర్డు తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామదేవతల సంబరాలు నిర్వహించామన్నారు. తొలిసారిగా తాను ఆలయ బోర్డు డైరెక్టర్ హోదాలో గ్రామదేవతల సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

ఏలూరు రూరల్ : ఏలూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీలకు మహర్దశ పట్టింది. నిరుపేదలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.45 కోట్లు వెచ్చించింది. కొమడవోలు, పోణంగి, లక్ష్మీపురం ఒకొక్క కాలనీకు రూ.15 కోట్లు చొప్పున కేటాయించింది. రూ.3 కోట్లతో ప్రతి కాలనీకు ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. వందలాది విద్యుత్ స్తంభాలు వేశారు. విద్యుత్ శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో పనులు చేపట్టి మొత్తంగా మూడు కాలనీలు కలిపి 93 కిలోమీటర్ల దూరం గల విద్యుత్ లైన్ అధికారులు వేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా అధికారులు, సిబ్బంది పనిచేసి కాలనీలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేశారు.

12 కోట్లతో 3 సబ్‌స్టేషన్లు

కాలనీల్లో నివసించే పేదలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కాలనీల్లో ప్రత్యేక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళిక రచించింది. దీనిలో భాగంగా కొమడవోలు, పోణంగి, లక్ష్మీపురం కాలనీలకు మూడు సబ్‌స్టేషన్లు అధికారులు ఏర్పాటుచేశారు. ఒకొక్క సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వివరించారు. దీనికి తోడు లక్ష్మీపురం, పోణంగి, కొమడవోలు కాలనీల్లో 202 ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం చేశారు. ఇప్పటికే 100కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. వీటికి తోడు మరో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం బిగించనున్నారు. ఇప్పటికే 7 కిలోమీటర్ల దూరం 11 కేవీ విద్యుత్ లైన్లు లాగారు. ఒకొక్క కాలనీకు 31 కిలోమీటర్ల చొపున మొత్తంగా 93 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు లాగారు. ప్రతి రెండు ఇళ్లకు మధ్య ఒక కరెంట్ స్తంభం వేశారు. వీటికి వీధిలైట్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇలా వందలాది స్తంభాలతో జగనన్నకాలనీ చూడముచ్చటగా మారింది.



చొదిమెళ్లలో ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్



కొమడవోలు కాలనీలో విద్యుత్ వైర్లు లాగుతున్న సిబ్బంది (ఫైల్)



పోణంగి జగనన్న కాలనీలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్



స్తంభాలు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ఉచిత విద్యుత్ కనెక్షన్

ఏలూరు నియోజకవర్గం జగనన్న కాలనీల్లో ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇప్పటివరకూ 2 వేల మంది పేదలకు అధికారులు ఉచిత విద్యుత్ కనెక్షన్ అందించారు. దీనివల్ల ఒకొక్క పేదవాడికి రూ.5 వేలు లబ్ధి చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ప్రతి ఇంటికీ సర్వీస్ వైర్, మీటర్, బోర్డు, ఎంసీబీ, ఎర్త్ వైర్ బిగిస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి కాగానే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి లబ్ధిదారుడు ఆధార్, ఇంటిస్థలం పట్టా జిరాక్స్ తీసుకుంటున్నారు. పత్రాలు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి విద్యుత్ కనెక్షన్ అందిస్తున్నారు. దీని నిమిత్తం లబ్ధిదారుడు ఒక్కపైసా కూడా చెల్లించాల్సిన పని లేదు.

30 వేల స్థలాల పంపిణీ

నియోజకవర్గంలో ప్రభుత్వం మొత్తంగా 30 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఇందులో మొదట ఏడాది పోణంగిలో 7035, కొమడవోలులో 9954, లక్ష్మీపురంలో 7017 అందించింది. 90 రోజుల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా మరో 6 వేల స్థలాలు పేదలు అందుకున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి మొత్తం కాలనీలన్నీ అధికారులు మెరక చేశారు. దీంతో ఒకొక్క లబ్ధిదారుడికి 1 లక్ష రూపాయల మేర లబ్ధి చేకూరింది.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయలని కోరుతూ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా శాఖలు వినతి పత్రం అందజేశాయి. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 9 ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు పి.ఆంజనేయులు, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ ఉద్యోగుల ధర్నా

ఏలూరు (టూటౌన్) : సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరులోని డీసీసీబీ బ్యాంక్ వద్ద సొసైటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాలో సొసైటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా జిల్లా కమిటీ తన ప్రకటనలో కోరింది.

తీరిన తాగునీటి కష్టాలు

- జలజీవన్ మిషన్‌లో రక్షిత మంచినీటి పథకం
- రూ.39.82 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం
- సత్రంపాడు యాదవనగర్‌లో 4 వేల కుటుంబాలకు మేలు



యాదవనగర్‌లో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు



రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని, మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని విశేష కృషి చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లోనూ ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారు. జలజీవన్ మిషన్ నిధులతో ఏలూరు నగరంతోపాటు, నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లోనూ ప్రజలకు రక్షిత తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. నగరంలో విలీనమైన ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు వెచ్చిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. ఏలూరు సత్రంపాడు యాదవ నగర్‌లో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఇటీవల ప్రారంభించారు.

4వేల కుటుంబాలకు మేలు

ఏలూరు సత్రంపాడు యాదవనగర్, పరిసర ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటోన్న ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో జీవనం సాగిస్తున్నా నీటి కష్టాల నుంచి కాపాడిన నాథుడే కరువయ్యాడు. ఏలూరు 22వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికై నగర డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నూకపెయ్యి సుధీర్‌బాబు యాదవనగర్ ప్రాంత ప్రజల తాగునీటి కష్టాలకు ముగింపు పలికేందుకు నిర్ణయించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని దృష్టికి తాగునీటి సమస్య తీసుకువెళ్ళగానే ఆయన సానుకూలంగా స్పందించటమే కాదు జలజీవన్ మిషన్ నిధులతో రక్షిత తాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.39.82 లక్షలతో భారీ ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేశారు. 2022 అక్టోబర్ 27న ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేయగా, కేవలం ఏడాదిలోపు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవం చేయటం విశేషం. దీంతో సత్రంపాడు యాదవనగర్‌లోని సుమారు 4వేలకు పైగా కుటుంబాలకు తాగునీటి కష్టాలు తీరాయి.

ఎమ్మెల్యే ఆళ్ల నానితోనే అభివృద్ధి సాధ్యం



ఏలూరు నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఏకైక నాయకుడు ఎమ్మెల్యే ఆళ్లనాని. నగరంలో అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే నానితోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. నా డివిజన్‌కు సంబంధించి యాదవనగర్‌లో వేలాదిమంది ప్రజలకు మేలు చేసేలా రక్షిత తాగునీటి పథకం కావాలని కోరిన వెంటనే మంజూరు చేయటంతోపాటు, జలజీవన్ మిషన్‌లో నిధులతో నిర్మాణం చేసేలా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే నాని నాయకత్వంలో ఏలూరును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, నగర డిప్యూటీ మేయర్

ఉమామహేశ్వరరావుకు నివాళి



ఉమామహేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : సీపీఐ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐవైఎఫ్ నాయకులు బోగా ఉమామహేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఏలూరు నగరంలో సీపీఐ పార్టీ, ప్రజానాట్యమండలి, యువజన సమాఖ్యలను నిర్మాణం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక 36వ డివిజన్ భగత్ సింగ్ స్మారక గ్రంథాలయం వద్ద ఆదివారం ఉమామహేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక డివిజన్ సీపీఐ శాఖ కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, సీపీఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, పోలా భాస్కర్, ఆర్ పెద్దిరాజు, బేతా శంకర్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, యర్రా నాగేశ్వరరావు, పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరులు

ఏలూరు (టూటౌన్) : అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో మాకు మేము సమర్పించుకుంటున్న రాజ్యాంగం అని చెప్పడంలోనే రాజ్యాంగం గొప్పతనం ఉందన్నారు. 29 రాష్ట్రాలు కలిగి ఉండే ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాపాడుకోవాలని కోరారు. ప్రశ్నించడం, భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా ప్రజలందరికి స్వాతంత్ర్యం ఉందని దీనిని భంగపరిచే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నను ప్రోత్సహించని సమాజం అభివృద్ధి చెందదన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ సందర్భంగా టెక్నికల్ సమస్యల వల్ల ఇబ్బందికి గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు ఫ్యాప్టో చేసిన కార్యాచరణను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తాత్కాలిక జిల్లా కమిటీ నాయకత్వానికి కొన్ని మార్పులు చేశారు. ప్రస్తుత అధ్యక్షులు ఆర్ రవికుమార్‌ను జిల్లా అధ్యక్షులుగా, జిల్లా సహాధ్యక్షురాలిగా వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారిగా జీవి రంగమోహన్, జిల్లా కార్యదర్శిగా యంవి బేతాళరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యునిగా సీహెచ్ పిచ్చోడును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

80 శాతం విద్యాకానుక పంపిణీ

దెందులూరు: మండలంలో 80 శాతం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ పూర్తయిందని దెందులూరు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్ బుద్ధావ్యాస్ అన్నారు. ఆదివారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభించిన రోజునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందజేసిన కానుకను విధిగా అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరఫరా, పంపిణీ సంతృప్తికర్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సహాయ సహకారాలతో విజయవంతమైందన్నారు. మిగిలిన 20 శాతం రెండు రోజుల్లో అన్ని పాఠశాలల్లో ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమన్వయంతో పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని విద్యాశాఖాధికారి బుద్ధావ్యాస్ సూచించారు.

మూడు టిప్పర్ల సీజ్

పెదవేగి : జానంపేట పంచాయతీ ప్రకాష్ నగర్ నుంచి ఏలూరుకు మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్ నగర్ నుంచి మట్టిని ఏలూరుకు రాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై వచ్చిన సమాచారంతో వాటిని స్వాధీనం చేసుకుని టిప్పర్లను సీజ్ చేయడంతోపాటు వాటి యజమానులైన ఏలూరుకు చెందిన తాళ్ల శ్రీనివాసరావు, కామన నాగేశ్వరరావుతోపాటు ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

భూతగాదాలో మహిళపై దాడి

లింగపాలెం : లింగపాలెం మండలం సింగగూడెం పంచాయతీ శివారు గొల్లగూడెంలో భూతగాదాల నేపథ్యంలో ఆదివారం ఒక మహిళపై దాడి జరిగింది. వివరాల ప్రకారం గొల్లగూడేనికి మానికల సోమేశ్వరరావు, భూలక్ష్మీ దంపతులు తమ పొలంలో పశువుల కోసం జాడు వేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మానికల సత్యనారాయణ, హరికృష్ణ, రాంబాబు, నాగరాజు, కుమారి, వెంకమ్మ అనే వారు ఆ పొలం తమదంటూ జాడు పైరుకు నిప్పంటించారు. అడ్డుగా వచ్చిన భూలక్ష్మి, సోమేశ్వరరాలపై దాడి చేయగా భూలక్ష్మికి చేయి విరిగింది. ఆమెకు చింతలపూడి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులు ధర్మాజీగూడెంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	30